క్లుప్తంగా

పరామర్శ



నారపరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారపరెడ్డి తండ్రి గుండాల వెంకటరామిరెడ్డి (84) మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి వెంకటరామిరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని అధైర్య పడకూడదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రమేష్, సర్పంచ్ ఓబిరెడ్డి, నాయకులు రామకృష్ణా రెడ్డి, జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హర్ దిల్ మే వైఎస్సార్'

అమడగూరు: ఓడీ చెరువు మండలంలోని మైనార్టీ సోదరులు బుధవారం హర్ దిల్ మే వైఎస్సార్ కార్యక్రమం కింద హమ్ సబ్ జగన్‌కే సాథ్‌ను నిర్వహించారు. ఓడీ చెరువులోని రెండు మసీదుల వద్ద ముస్లిం సోదరులు కరపత్రాలను విడుదల చేసి మైనార్టీలకు ప్రభుత్వం అండగా ఉందన్న విషయాన్ని తెలియజేశారు. భవిష్యత్తులో మైనార్టీ సోదరులంతా ప్రభుత్వానికి తోడుగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షానీసేట్, డైరెక్టర్ జౌలీ బాబా, జిల్లా ప్రధాన కార్యదర్శి షామీర్, కొత్తపల్లి భాషా, ఇమామ్‌సాబ్ అల్లాబకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జేడీ అమరావతి

ధర్మవరం అర్బన్: భవిత సెంటర్‌లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని సమగ్ర శిక్ష జేడీ అమరావతి తెలిపారు. పట్టణంలోని భవిత సెంటర్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం సెంటర్‌లోని మానసిక విద్యార్థులకు అందిస్తున్న వైద్యసేవలు, వారికి ఆటపాటల కోసం అందిస్తున్న పరికరాలు తదితర వాటిపై ఎంఈఓ-1 రాజేశ్వరిదేవిని అడిగి తెలుసుకున్నారు. మానసిక విద్యార్థులంతా తప్పకుండా భవిత సెంటర్‌కు వచ్చేలా ఐఈఆర్‌టీలు కృషి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా సెక్టోరియల్ అధికారి ఆనంద్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ



పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తనకల్లు: స్థానిక తనకల్లు-1 గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పూల నరసింహులు మాట్లాడుతూ అన్ని అర్హతలున్న వారికి ప్రభుత్వం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇంటి వద్దకే అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 1,546 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ డీ. సరస్వతీ, ఈఓఆర్డీ ఆనందయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, జేసీఎస్ కన్వీనర్ హేమశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉచితంగా 11 రకాల సేవలు

ముదిగుబ్బ: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తోందని ఎంపీపీ ఆదినారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సంకేపల్లి, గాండ్లవారిపల్లి గ్రామాలలో జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి నరసింహమూర్తి, తహసీల్దార్ నాగేంద్ర, సర్పంచులు ప్రసన్న వేణుగోపాల్, సూర్యనారాయణ, ఎంపీటీసీ ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని న్యామద్దల-2 సచివాలయ పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. 500 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ గంగావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ తదితరులున్నారు.

నేడు ముక్తాపురంలో 'జగనన్న సురక్ష'

కనగానపల్లి: ముక్తాపురంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించే సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

వరి సాగు.. జాగ్రత్తలతో బాగు!

- నారుమడుల్లో రైతన్నలు బిజీ
- సూచనలు పాటించాలంటున్న అధికారులు



పోట్లమర్రి వద్ద నారుమడి

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వరి పంట సాగు కోసం రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో బీపీటీ, స్వర్ణ వరి నారుమళ్లు పోసుకుంటున్నారు. రైతులు వరినారు పెంపకంలో మెళకువలు పాటిస్తేనే ఆరోగ్యకరమైన నారుతో అధిక దిగుబడులు వస్తాయని బత్తలపల్లి వ్యవసాయాధికారి ఓబిరెడ్డి తెలిపారు. రైతులకు సలహాలు తెలియజేశారు.

అనువైన రకాల ఎంపిక..

వాతావరణ పరిస్థితులకు అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న కారలు అధిక దిగుబడినిచ్చే, అధిక ఎరువుల వినియోగ సామర్థ్యం కలిగి ఉండాలి. ముఖ్యంగా కొన్ని వరి రకాలతో రకాన్ని బట్టి నత్రజని ఆవశ్యకత ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు స్వర్ణ వరి రకానికి తక్కువ నత్రజనితో ఎక్కువ దిగుబడిని ఇవ్వగల శక్తి ఉంటుంది. తక్కువ మోతాదులో నత్రజని ఎరువులను ఉపయోగించాలి.

పొలాన్ని ఇలా చేయాలి..

వరి నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి 2-3 పర్యాయాలు మురుగే విధంగా దమ్ము చేసుకోవాలి. మడిలోని పొలమంతా నీరు తిరిగేలా గొర్రుతో గానీ, చెక్కతో గానీ చదును చేసుకోవాలి. నల్ల రేగడి పొలాల్లో రెండు రోజులు ముందే దమ్ము చేసుకొని ఉండాలి.

నాట్లు వేయడంలో...

నాట్లు వేయడానికి నారు మడి నుంచి నారును తీసేటప్పుడు లేతాకు పచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరగబడుతుంది. నాటడానికి 4-6 ఆకులు ఉన్న నారును మాత్రమే ఉపయోగించాలి. ముదురు ఆకులున్న నారు నాటితే దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో నారును పైపైన నాటుపెడితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చదరపు మీటరు పొలంలో 33 మూనలు ఉండే విధంగా నాట్లు వేసుకోవాలి. నాట్లు మధ్యలో ప్రతి రెండు మీటర్ల ఎడమలో 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదులుకోవాలి. బాటలు తీయడంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపులో ఉంటుంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీ, కలుపు మందులు వేయడానికి బాటలు బాగా ఉపయోగపడతాయి.

ఆరోగ్యవంతమైన నారు పెంపకం ఇలా..

- వరి నారు పెంచదల్చిన వారు మడిని 10-12 రోజుల వ్యవధిలోనే మూడు దఫాలుగా దమ్ముచేసి పొలాన్ని చదును చేసుకోవాలి. నారు మడిలో నీరు పెట్టడానికి, తీయడానికి అనువుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని(ఒక కిలో విత్తనం చల్లడానికి ముందు, మరో కిలో విత్తనం నారుమడిలో చల్లిన 12-14 రోజులకు, కిలో భాస్వరం, కిలో పోటాస్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేసుకోవాలి.
- మొలక కట్టిన వరి విత్తనాన్ని సెంటు పొలంలో 5 కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత నీరు పలుచగా నిలవకట్టాలి.
- పొలంలో జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- విత్తనం చల్లిన పది రోజులకోసారి, 17 రోజులు రెండోసారి మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటరు లేదా క్లోరిపైరిఫాస్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. నాట్లు వేయడానికి వారం రోజుల ముందు 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారుమడిలో తక్కువ నీరు ఉండే విధంగా చూసుకొని చల్లుకోవాలి.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



ఓటరు సర్వేను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

ధర్మవరం అర్బన్: ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలోని బాబు జగజ్జీవన్‌రామ్‌నగర్, చంద్రబాబునగర్, శాంతినగర్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటా కమిషనర్ తిరుగుతూ ఎంత మంది ఓటర్లు ఉన్నారు, వేరేచోట ఉన్నారా, మృతి చెందిన ఓట్లు ఉన్నాయా, ఇల్లు మార్చారా తదితర విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు బీఎల్‌ఓ, బీఎల్ఏలు 35 నుంచి 40 మంది ఓటర్లను టార్గెట్‌గా సర్వే చేయాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవకతవకలకు పాల్పడరాదన్నారు. నియమ నిబంధనల ప్రకారం చేయాలన్నారు. ప్రస్తుతం పట్టణంలో 1,00,603 మంది ఓటర్లు ఉన్నారని ఇప్పటి వరకు దాదాపు 9 వేల వరకు ఓటర్ సర్వేను పూర్తి చేశామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఓటరు సర్వే కార్యక్రమం ఆగస్టు 20వ తేదీ వరకు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. సర్వేకు వచ్చే బీఎల్‌ఓలకు ప్రజలు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వలంటీర్లు వెన్నెముక లాంటివారు



ఉత్తమ వలంటీర్లను సన్మానిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా నిలుస్తున్న వలంటీర్లు ప్రభుత్వానికి వెన్నెముక లాంటి వారని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి అధ్యక్షతన వలంటీర్లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్తమ పనితీరుతో సేవారత్నలుగా ఎంపికైన బండారు అనిత, జవాబు చందనలకు శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు. సేవా మిత్రలుగా ఎంపికైన 17 మంది వలంటీర్లకు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి, సర్పంచ్ బండారు బాలమ్మ, వైస్ ఎంపీపీలు యర్రగంగు కృష్ణమనాయుడు, బీసాని లింగమ్మలు శాలువాలు కప్పి అభినందించారు. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, మారక శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వడ్డి లిగారెడ్డి, పిట్టు పరమేశ్వర్‌రెడ్డి,హరి,రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బాబు పాలనంతా దోచి దాచుకోవడమే



'గడప గడప'లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి విమర్శ

కదిరి: 'వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతోంది. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నారు. చంద్రబాబు పాలనలో అలా లేదు. దోచుకోవడం.. దాచుకోవడమే వారి పని' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే పట్టణంలోని 26వ వార్డులో, మధ్యాహ్నం 11వ వార్డులో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలకు మునుపు తన పాదయాత్రలో ప్రజలకిచ్చిన ప్రతి హామీని అధికారంలోకి రాగానే అమలు చేశారని గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు ఇక్కడ అమలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు 600కు పైగా హామీలిచ్చి ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయని తెలిసి అనేక అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎల్లో మీడియా చెత్త రాతలను ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేని 26వ వార్డు కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్మన్‌లు గంగాదేవి, రాజశేఖర్‌రెడ్డి, కమిషనర్ శ్రీహరిబాబు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన



నల్లమాడ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండన్న

ఎన్పీకుంట: మండలంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని సర్పంచ్ అంజినమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్.పీ.కుంట-1 సచివాలయం ఆవరణలో ఎంపీడీఓ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్.పీ. కుంట-2 సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను ఉచితంగా అందించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 10 సచివాలయాలలో వివిధ సమస్యలపై 7,690 టోకెన్లు జనరేట్ చేయగా 7,291 సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన సర్టిఫికెట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఈఓఆర్డీ మనోహర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నల్లమాడ మండలంలో..

నల్లమాడ: మండలంలోని దొన్నికోట సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. సర్పంచ్ రాగినేని సరస్వతి అధ్యక్షతన జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో 1,117 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. అధికారులు, పలువురు నాయకులు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని అన్నారు. ఎంపీడీఓ కొండన్న, డిప్యూటీ తహసీల్దార్ కేఎస్ మల్లికార్జున, పంచాయితీ కార్యదర్శి రాంమోహన్, మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గోపాల్‌నాయుడు, నాయకులు నాగరాజునాయుడు, బాలాజీనాయుడు, కమలాకర్ నాయుడు, అంజి, ఆలంసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరి ప్రమేయం లేకుండానే నవరత్నాలు

తాడిమర్రి: ఎవరి ప్రమేయం లేకుండా సామాన్యులకు సంక్షేమ పథకాలు (నవరత్నాలు) అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురికి కుల, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు బాలమ్మ, సింగిల్‌విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు యర్రగంగు కృష్ణమనాయుడు, బీసాని లింగమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు పొరాళ్ల విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వడ్డి గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ తాడిమర్రి రమణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, కో ఆప్షన్ సభ్యులు బాబా ఫక్రొద్దీన్, తాడిమర్రి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ ప్రసాద్‌పై ఆరోపణలు అర్థరహితం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: మహాత్మా జ్యోతిపూలే గురుకుల పాఠశాల కన్వీనర్‌గా పనిచేస్తున్న లేపాక్షి స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌పై లేనిపోని ఆరోపణలు అర్థరహితమని ఎస్సీ, ఎస్టీ స్టూడెంట్ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు అన్నారు. పుట్టపర్తి పట్టణంలో సత్యమ్మ ఆలయం వద్ద విలేకర్లతో బుధవారం ఆయన మాట్లాడారు. స్కూల్ అడ్మిషన్ల విషయంలో ఆర్థిక ప్రలోభాలకు పాల్పడ్డారని ప్రసాద్‌పై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. నిజాయితీ గల వ్యక్తిపై బురద జల్లడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘం నాయకులు సతీస్ కుమార్, రామాంజనేయులు, దాస్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఎమ్మెల్యే చేయూత



వెంటకలక్ష్మమ్మకు నగదు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

తనకల్లు: మండల పరిధిలోని కనసానివారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మారేపల్లి శ్రీనివాసులరెడ్డి నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శ్రీనివాసులరెడ్డి అంత్యక్రియలకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి హాజరై ఆయన ఇద్దరు కుమారులు హరీష్‌రెడ్డి, కార్తిక్ రెడ్డిల ఉన్నత చదువు బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏటా రూ. లక్ష చొప్పున ఐదేళ్లు రూ. 5 లక్షలు ఇస్తానన్నారు. మాట ప్రకారం బుధవారం మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చిదానందరెడ్డి, జంగమరెడ్డి, గ్రామ పెద్ద మారేపల్లి నరసింహారెడ్డి చేతుల మీదుగా రూ. 50 వేలు మృతుని కుటుంబీకులు వెంకటలక్ష్మమ్మకు అందజేయించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు రామ్‌దేశాయ్, వినోద్‌కుమార్, నాయకులు సమరసింహారెడ్డి, శ్రీకంఠారెడ్డి, రమణారెడ్డి, మహేష్, రమణ, అమర్నాథ్‌రెడ్డి, కమ్మిరెడ్డి, పాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రజక సంఘం మహాసభ జయప్రదం చేయండి



మహాసభ పోస్టర్లు విడుదల చేస్తున్న రజక సంఘం నాయకులు

ధర్మవరం అర్బన్: రజకుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఏపీ రాష్ట్ర రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు శివప్ప, జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 13న పుట్టపర్తిలోని శ్రీ సాయి ఆరామంలో నిర్వహించే ఏపీ రాష్ట్ర రజక సంఘం ప్రథమ మహాసభలో పెద్ద ఎత్తున రజకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామచంద్ర, శ్రీనివాసులు, ఆనంద్, ప్రసాద్, రాధాకృష్ణ, నరేంద్ర, నారాయణస్వామి, మల్లేనిపల్లి మహేష్, గంగరాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

అమడగూరు: అర్హులుగా ఉన్నవారికి జగనన్న ఇళ్లను మంజూరు చేస్తున్నామని ఓడీ చెరువు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు టీ కుంట్లపల్లి, వెంకటాపురం గ్రామ సచివాలయాల పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంకా ఎవరైనా ఇళ్లు లేక బాధపడుతుంటే హౌసింగ్ అధికారులను సంప్రదిస్తే మంజూరు చేస్తారన్నారు. గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీల పేరుతో లంచాలకు తావు లేదన్నారు. అర్హులుగా ఉంటే తప్పకుండా ఇంటిని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దశల వారీగా వెంటనే బిల్లులు కూడా మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకులు భాస్కర్‌రెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, అగ్రి చైర్మన్ లక్ష్మీరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మధుసూదన్ నాయుడు, చెన్నారెడ్డి, ఎంపీటీసీ సూర్యప్రకాష్ నాయుడు, భానుప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కదిరి అర్బన్: మండల పరిధిలోని ముత్యాలచెరువు సర్పంచ్ శుభలేఖ విశ్వనాథ్ మామ పెద్దన్న బుధవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్న సరిగెత్తు



బత్తలపల్లి కాశీంస్వామికి చదివింపులు చేస్తున్న ముల్లాసాహెబ్‌లు

బత్తలపల్లి: బత్తలపల్లిలోని చిన్నకాశీం స్వామి, పెద్ద కాశీంస్వామి మొహర్రం ఉత్సవాలలో భాగంగా బుధవారం చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు పానకాలు చదివించగా, బుధవారం రాత్రి హిందువులు పక్కీరుబాబాలుగా దీక్ష చేపట్టారని ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహాబూబ్‌బాషా, నజరుల్లా, ఖాశీంవలి తెలిపారు. చిరుజల్లుల కారణంగా అగ్ని గుండం పెద్దగా వెలగలేదు. వర్షం కురుస్తుండడంతో వేడుకలకు అంతరాయం కలిగింది. గురువారం ఉదయం గ్రామోత్సవం అనంతరం పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లి ఆ గ్రామాలలో నిలిపిన పీర్ల చావిడి వద్ద పీర్లు పూజలందుకుంటాయి. గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలలో బత్తలపల్లి పీర్లకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు



చావిడిలో కొలువుదీరిన పీర్ల స్వాములు

కనగానపల్లి: మండల కేంద్రంలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిన్న సరిగెత్తును ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చావిడిలో కొలువుదీరిన దస్తగిరి, కుల్లాయి, వన్నూరుస్వాములను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేశారు. భక్తులు పీర్లస్వాములకు చక్కర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకొన్నారు. నంద్యాల జిల్లా భక్తులు కన్నా లక్ష్మీనారాయణ, శివారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

కాటం శంకర్ కన్నుమూత



కాటం శంకర్ (ఫైల్)

కదిరి: ప్రముఖ వ్యాపారవేత్త, సీనియర్ రాజకీయ నాయకుడు కాటం శంకర్ కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తెల్లవారు జామున కదిరి ప్రభుత్వాసుపత్రిలో తుది శ్వాస విడిచారు. కాటం శంకర్ కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో పని చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు వస్త్ర వ్యాపారంతో కదిరి ప్రాంత వాసులందరికీ సుపరిచితులు. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, డా.బత్తల హరిప్రసాద్, మగ్బుల్, పలు రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కదిరి-రాయచోటి రోడ్‌లోని కదిరి కొండ వద్ద అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తచెరువు మండల కార్యాలయంలో ఎంపీడీఓ సిద్దారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శ్మశాన వాటికలు, రైతులు పొలంలోకి వెళ్లే రహదారుల్లో కంపచెట్లు తొలగించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు తగిన సూచనలు సలహాలు అందించాలని కోరారు. సమష్టిగా అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సరళ, పార్టీ మండల కన్వీనర్ జగన్‌మోహన్ రెడ్డి, తహసీల్దార్ రామాంజనేయరెడ్డితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.